క్లుప్తంగా

అధ్యాపకుడు రామప్రసాద్‌కు అభినందనలు


కోట రామప్రసాద్

ఉండ్రాజవరం: స్థానిక బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకుడు కోట రామప్రసాద్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ఈ మెయిల్ ద్వారా శుక్రవారం అభినందన పత్రం పంపించారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులు, ఉపాధ్యాయులతో జాతీయ స్థాయిలో పరీక్ష పే చర్చ (పరీక్షలపైన చర్చ) కార్యక్రమం నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యక్షంగానూ, కొంత మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు వర్చువల్‌గానూ పాల్గొన్నారు. ఉండ్రాజవరం బాలికల జూనియర్ కళాశాలలో ఆంగ్లభాష అధ్యాపకుడిగా పని చేస్తున్న కోట రామప్రసాద్ వర్చువల్‌గా పాల్గొన్నారు. పరీక్షల సంస్కరణల్లో భాగంగా ఓపెన్ బుక్ విధానంలో పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో మాస్ కాపియింగ్‌ను అరికట్టవచ్చని గతంలో విద్యారంగ మేధావులు తెలియజేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రధాని మోదీ దృష్టికి రామ్‌ప్రసాద్ తెచ్చారు. దీంతో ప్రధాని మోదీ మెయిల్ ద్వారా రామప్రసాద్‌ను అభినందించారు. ఈ సందర్భంగా రామప్రసాద్‌ను కళాశాల ప్రిన్సిపాల్ వారణాసి విశ్వప్రసాద్, విద్యాకమిటీ చైర్మన్ కరెళ్ల సోమేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

నేటి నుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు


నిడదవోలు రూరల్: నిడదవోలు 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకూ వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసినట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల పరిధిలో ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకూ రెండు విడతలుగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. రైతులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


గరప్పాడులో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ వీరాస్వామి

చాగల్లు: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ మట్టా వీరాస్వామి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని గరప్పాడులో మండల పరిషత్ నిధులు సుమారు రూ.40 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సారథ్యంలో గరప్పాడు, కుంకుడిమిల్లి, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ రేలంగి సుధాకర్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గోపి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ


లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న నాయకులు

దేవరపల్లి: త్యాజంపూడిలోని జగనన్న లేఅవుట్‌కు చెందిన లబ్ధిదారులకు శుక్రవారం సాయంత్రం ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలను ఉప సర్పంచ్, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్ అందజేశారు. గ్రామంలో 60 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేసినట్టు చెప్పారు. 90 మందికి స్థలాలు మంజూరు కాగా, మొదటి విడతలో 60 మంది పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తయినట్టు తెలిపారు. మిగిలిన 30 మందికి త్వరలో అధికారులు అందజేస్తారన్నారు. లేఅవుట్లో గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పల్లి రాంబాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడు పల్లి వెంకటరత్నారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోతుల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మేము సిద్ధం బైక్ ర్యాలీ

కొవ్వూరు: పట్టణంలో మేము సిద్ధం నినాదంతో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. ఉదయం 9 గంటలకు తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో డ్రైయినేజీలకు శంకుస్థాపన, సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని 21వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. కావున ఆయా కార్యక్రమాలకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ప్రజల వెంట.. ప్రగతి బాట

- గ్రామాల్లో హోం మంత్రి వనిత విస్తృత పర్యటనలు
- ఎన్నికల వేళ క్యాడర్‌లో నూతనోత్సాహం
- పార్టీ వర్గాలతో కలిసి వ్యూహ రచనలు


ఐఎస్ జగన్నాథపురంలో పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి వనిత (ఫైల్)

దేవరపల్లి: ప్రజలతో మమేకమవుతూ.. సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తూ రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత చురుగ్గా ముందుకు సాగుతున్నారు. దాదాపు 55 రోజుల నుంచి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మంత్రి వనిత విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆమె పర్యటనలతో వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో నూతనోత్సాహం ఏర్పడింది. ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు మంత్రి వనిత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా సమరానికి మేము సిద్ధం అని పార్టీ శ్రేణులు చెబుతున్నారు. గ్రామ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి, వారిని ఏకతాటిపై నడిపిస్తున్నారు. పార్టీ శ్రేణులకు వచ్చే ఎన్నికలకు దిశానిర్దేశం చేస్తున్నారు. మూకుమ్మడిగా వస్తున్న ప్రతిపక్ష పార్టీలను ఎదుర్కొనే దానిపై పార్టీ వర్గాలతో వ్యూహరచన చేస్తున్నారు. ఉదయం పది నుంచి రాత్రి 12 గంటల వరకూ ప్రజల మధ్యనే ఉండి, వారి సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి, తక్షణ పరిష్కారం చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

అభివృద్ధి పనుల హోరు

సుదీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని రహదారుల నిర్మాణానికి మంత్రి వనిత శంకుస్థాపనలు చేసి, పనులను వేగవంతం చేయిస్తున్నారు. ఆయా పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 80 గ్రామాల్లో మంత్రి వనిత పర్యటించారు. పేదలకు ఇళ్లస్థలాల పట్టాలు, మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ, జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ, అసైన్డ్ భూముల పంపిణీ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు రూ.14 కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణాలకు ఆమె శంకుస్థాపన చేశారు.

పట్టాల సమస్య పరిష్కారం

ద్వారకా తిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో 169 మంది రైతులకు 125 ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలు పంపిణీ చేశారు. గ్రామంలోని సన్నచిన్నకారు రైతులు పూర్వకాలం నుంచి భూములను సాగు చేసుకుంటున్నారు. దాదాపు 20 ఏళ్లుగా పట్టాల కోసం ఎదురుచూస్తున్నారు. అప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా పట్టాలు ఇవ్వలేదు. ఈ సమస్యను ఇటీవల రైతులు మంత్రి తానేటి వనిత దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె రైతులందరికీ వారం రోజుల్లో పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సోమవారం సాయంత్రం నాటికి రైతులందరికీ మంత్రి వనిత చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేసి, హామీని నిలబెట్టుకున్నారు. రెండు దశాబ్దాల సమస్య పరిష్కారం కావడంతో రైతుల కటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.

రోడ్లకు మహర్దశ

గత ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురై, ధ్వంసమైన జి.కొత్తపల్లి–పోతవరం రోడ్డు నిర్మాణానికి మంత్రి వనిత శంకుస్థాపన చేశారు. రోడ్డు నిర్మాణానికి రూ.3.46 కోట్లు మంజూరయ్యాయి. దేవరపల్లి మండలం యర్నగూడెం–పోతవరం రోడ్డును రూ.1.89 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు మంత్రి వనిత శంకుస్థాపన చేశారు. నాలుగు మండలాల్లో గత 55 రోజులుగా వివిధ పార్టీల నుంచి సుమారు 300 కుటుంబాలు మంత్రి వనిత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.

ఆదుకుంటున్న సీఎంఆర్ఎఫ్

దేవరపల్లి: ఆపదలో ఉన్నవారిని ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంటోందని మంత్రి తానేటి వనిత అన్నారు. పల్లంట్లలో గురువారం రాత్రి మూడు కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ దేవరపల్లికి చెందిన దుగ్గిన సూర్యచంద్రరావుకు రూ.1.40 లక్షలు, యర్నగూడేనికి చెందిన గొల్లపల్లి రాంబాబుకు రూ.35 వేలు, చిన్నాయగూడేనికి చెందిన మేడ్ని లక్ష్మికి రూ.1 లక్ష మంజూరైనట్టు చెప్పారు. ఎంతో మంది రోగులకు సీఎంఆర్ఎఫ్ పథకం ప్రాణం పోస్తోందని తెలిపారు. పార్టీలు, కులమతాలకతీతంగా సీఎం సహాయ నిధిని అందజేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం పార్లమెంటరీ కో–ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.


పల్లంట్లలో లబ్ధిదారురుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న మంత్రి వనిత

దేవరపల్లికి అగ్నిమాపక కేంద్రం మంజూరు

- రూ.2.74 కోట్ల కేటాయింపు
- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత వెల్లడి



దేవరపల్లి: దేవరపల్లిలో అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి తానేటి వనిత వెల్లడించారు. అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి రూ.2.74,33,000 మంజూరు చేసినట్టు చెప్పారు. 18 మంది సిబ్బందిని కొత్తగా నియమించనున్నట్టు తెలిపారు. అగ్నిమాపకాధికారి, లీడింగ్ ఫైర్‌మెన్లు ముగ్గురు, ఫైర్‌మెన్లు 13 మంది, స్వీపర్ పోస్టు ఒకటి, మొత్తం 18 మందిని కొత్తగా నియమించనున్నట్టు వివరించారు. సిబ్బంది నియామకానికి రూ.85.05 లక్షలు, ఫైర్ స్టేషన్ నిర్మాణానికి రూ.1,89,28,000 మంజూరైనట్టు తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, ద్వారకా తిరుమల మండలాలకు ఫైర్ స్టేషన్ ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటి వరకు దేవరపల్లి మండలానికి కొవ్వూరు, నిడదవోలు నుంచి, గోపాలపురం మండలానికి జంగారెడ్డిగూడెం, నల్లజర్ల మండలానికి తాడేపల్లిగూడెం, ద్వారకా తిరుమల మండలానికి భీమడోలు అగ్నిమాపక కేంద్రం నుంచి ప్రమాదాల సమయంలో ఫైరింజన్లు వస్తున్నాయని తెలిపారు. దాదాపు 20 నుంచి 30 కి.మీ. దూరంలో అగ్నిమాపక కేంద్రం ఉండడంతో అగ్ని ప్రమాదాలు జరిగిన సమయాల్లో తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ప్రజల చిరకాల కోరిక అయిన అగ్నిమాపక కేంద్రం ఇప్పటికి నెరవేరిందన్నారు. త్వరలో దేవరపల్లిలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణం చేపడతామని తెలిపారు.

రూ.4.65 కోట్లతో వంతెన నిర్మాణం

- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- రుడా నిధులు రూ.88 లక్షలతో ఈట్‌స్ట్రీట్ నిర్మాణం


పశ్చిమ డెల్టా కాలువపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు


కానూరు అగ్రహారంలో తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

నిడదవోలు: గత టీడీపీ అవినీతి పాలనలో పశ్చిమడెల్టా ప్రధాన కాలువపై నిర్మించిన పురాతన ఐరన్ గడ్డర్ బ్రిడ్జి కుప్పకూలిపోవడంతో దాని స్థానంలో మన ప్రభుత్వంలో రూ.కోట్ల నిధులు మంజూరు చేయించి వంతెన పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని ఐదో వార్డులో చినకాశిరేవులో ఆర్‌అండ్‌బీ నిధులు రూ.4.65 కోట్లతో పశ్చిమడెల్టా ప్రధాన కాలువపై నిరించనున్న వంతెన నిర్మాణం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద రుడా నిధులు రూ.88 లక్షలతో నిర్మించనున్న ఈట్‌స్ట్రీట్ ఫాస్ట్‌ఫుడ్ షాపుల సముదాయ నిర్మాణాలకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ పాలకులు కాసులకు కక్కుర్తిపడి కనీసం నాణ్యతా ప్రామాణాలను పాటించకుండా గడ్డర్ బ్రిడ్జి మరమత్తు పనులు చేపట్టడంతో ఐరన్ బ్రిడ్జి కుప్పకూలిపోయిందన్నారు. చినకాశిరేవులో సుమారు 30 పైగా వివిధ దేవతామూర్తుల ఆలయాలు ఉన్నాయని, ఇక్కడకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం, కైలాసభూమికి వెళ్లడానికి అనువుగా వంతెన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రోజువారీ పనుల్లో బిజీగా గడుపుతున్న పట్టణ ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణంలో రుడా నిధులు రూ.88 లక్షలలో ఈట్‌స్ట్రీట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, ఎండీ షకీరాబేగం, ఎస్‌కే వజీరుద్దీన్, పువ్వల రదీదేవి, అహ్మదు న్నీషాబేగం, గుర్రం శాంతిశ్రీ, ఆకుల ముకుందరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, పెరవలి జెడ్పీటీసీ కొమ్మిశెట్టి రామాంజని, మద్దిపాటి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

పెరవలి: నియోజకవర్గంలో భవిషత్ తరాలకు తాగునీటి ఎద్దడి లేకుండా చేయడం కోసమే ప్రతి గ్రామంలో ఓహెచ్ఆర్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టినట్టు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని కానూరు అగ్రహారంలో రూ.73 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. రూ.72 కోట్లతో గ్రామాల్లో ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గత టీడీపీ హయాంలో దోచుకో–దాచుకో.. అన్న చందాన పాలన సాగిందన్నారు. టీడీపీ పాలకులు పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు వీరమళ్ల సత్యనారాయణ, మండల గృహసారథుల అధ్యక్షుడు రామడుగుల సూర్యనారాయణ, సర్పంచ్ దాసం వెంకన్న, పార్టీ గ్రామాధ్యక్షుడు దాసం బాపన్న, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సొంతింటి కల నిజం చేసిన జగనన్న

- హోం మంత్రి తానేటి వనిత
- 1,312 ఇళ్ల పట్టాల పంపిణీ


నల్లజర్లలో ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి వనిత

నల్లజర్ల: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నిరుపేదల సొంతింటి కల నిజం చేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. శుక్రవారం నల్లజర్లలో వివిధ గ్రామాలకు చెందిన 1,312 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను మంత్రి అందజేశారు. మంత్రి వనిత మాట్లాడుతూ సీఎం జగనన్న పక్కా డాక్యుమెంటుపై రిజిస్ట్రేషన్ చేసిన పట్టా ఇస్తున్నారని చెప్పారు. ఏదైనా అవసరం వస్తే, రుణం కూడా పొందవచ్చన్నారు. ఇంట్లో వాళ్లు కూడా ఇంతగా ఆలోచించరని, జగనన్న రుణం తీర్చుకోలేనిదన్నారు. వచ్చే ఎన్నికలలో ప్రజలంతా జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ బంక జయలక్ష్మి, ఎంపీటీసీ మేణ్ని వెంకటలక్ష్మి, సర్పంచ్ పల్లిజ్యోతి, గోతం సత్యలక్ష్మి, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, గగ్గర శ్రీనివాస్, కారుమంచి రమేష్, వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, మద్దిపాటి ప్రసాద్, తొమ్మండ్రు రమేష్, కరుటూరి లక్ష్మిగణేశ్వరరావు, పిచ్చుకుల ప్రసాద్, ముప్పిడి వెంకటరత్నం, గన్నమని సుబ్బారావు, బండి చిట్టి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

అనంతపల్లి ఆర్యవైశ్య కలాణ మంటపంలో ఆత్మీయ సమావేశం జరిగింది. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ఏం చేయాలో వివరించారు. ఇళ్ల స్థలాల సమస్యపై పలువురు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ ద్వారా విచారణ జరిపి, అర్హులకు ఇళ్ల స్థలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ కమిటీ అధ్యక్షులు జాదుల దుర్గారావు, ఎంపీపీ బంక జయలక్ష్మి అప్పారావు, ఎంపీటీసీ యడ్లపల్లి మార్త, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, లైటింగ్ పండు, ఆరెళ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆనంద తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో పార్టీ నాయకుడు కొరటాని పండు మంత్రి వనితను క్రేన్ ద్వారా గజమాలతో సత్కరించారు. అనంతరం ఆర్బీకే, వెల్నెస్ సెంటర్లను మంత్రి ప్రారంభించారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ ఆశీర్వదించండి


కొవ్వూరు ఇందిరమ్మ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. పట్టణంలోని 18, 19, 21 వార్డుల్లో శుక్రవారం ఆయన ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని చెప్పారు. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ముదునూరి నాగరాజు, చొప్పా అప్పల నాయుడు, చిట్టూరి అన్నవరం, కవల నాగేశ్వరరావు, గుర్రే శరత్, బోడపాటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ఆస్రా కృషి

దేవరపల్లి: వినియోగదారుల పరిరక్షణకు అంతర్జాతీయ స్థాయిలో ఆస్రా సంస్థ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆలీ తెలిపారు. అంతర్జాతీయ వినియోగదారుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. 1972లో తమ సంస్థ ఏర్పడిందని, అప్పటి నుంచి వినియోగదారులకు కావాల్సిన మౌలిక వసతులు, హక్కులు తదితరుల అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఇటీవల కాలంలో సెల్‌ఫోన్ల ద్వారా సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నియంత్రణకు ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు పెట్టిన 272 కేసులను పరిష్కరించినట్టు తెలిపారు. దేవరపల్లి సీఐ పి.బాల సురేష్‌బాబు, ఆస్రా అంతర్జాతీయ ప్రతినిధి పి.రత్నంరాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు లాజరస్, దక్షిణ కొరియా తదితర దేశాల సభ్యులు పాల్గొన్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి


శిక్షణలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ వెంకటరమణ నాయక్


నిడదవోలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ ఈఆర్ఓ ఆర్.వెంకటరమణనాయక్ సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఓటింగ్ విధానంపై గ్రామీణులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై అపోహలు తొలగించాలని సూచించారు.ఎక్కడా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాల్ పోస్టర్లు ఉండటానికి వీలు లేదన్నారు. ఎన్నికలు సందర్భంగా ఎవరైనా మద్యం, డబ్బు, ఇతర సామగ్రి పంచితే అనుసరించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల తహసీల్దార్లు వి.నాగభూషణం, కె.నవీన్‌బాబు, డి.సుధ, నిడదవోలు ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు, ఆర్ఐ సత్యేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు


అన్నదేవరపేటలో కవాతు చేస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు, పోలీసులు

తాళ్లపూడి: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలందరూ సహకరించాలని తాళ్లపూడి ఎస్ఐ టి.శ్యామ్‌సుందర్ అన్నారు. మండలంలోని అన్నదేవరపేట, గజ్జరం, పోచవరం, తాడిపూడి గ్రామాల్లో సుమారు 200 మంది సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ ప్రజలంతా తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని సూచించారు.

సీఎం జగన్‌తోనే పేదలకు న్యాయం


శెట్టిపేటలో గ్రామ సచివాలయ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

నిడదవోలు రూరల్: పేదలకు న్యాయం జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిడదవోలు మండలం శెట్టిపేటలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జడ్డు శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీటీసీ సభ్యుడు బయ్యే కృష్ణబాబు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కురసాల నెహ్రూ, జడ్డు రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అశ్రద్ధ వద్దు


ఆవపాడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రేష్మ

నల్లజర్ల: కంటి సమస్యలపై అశ్రద్ధ చేస్తే శాశ్వత అంధత్వం వచ్చే అవకాశం ఉందని ఆప్తమాలజిస్ట్ డాక్టరు రేష్మ హెచ్చరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆమె స్థానికులకు నేత్ర వ్యాధులపై అవగాహన కలిగించారు. కంటి శుక్లాలు వచ్చినపుడు క్యాటరాక్ట్ శస్త్రచికిత్స తప్పక చేయించుకోవాలన్నారు. అశ్రద్ధ చేస్తే అది గ్లకోమాగా మారి శాశ్వత అంధత్వం వచ్చే అవకాశం ఉందన్నారు. శిబిరాన్ని వైస్ ఎంపీపీ అచ్యుత ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుతవెంకటస్వామి, పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు, సీహెచ్‌ఓ ప్రసాద్, ఆప్తమాలిక్ ఆఫీసర్ తగరం రాంబాబు, స్పెషలిస్ట్ డాక్టర్ సూర్య(ఆర్థోపెడిక్) పాల్గొన్నారు. మొత్తం 502 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఇంకా 46 మందికి నేత్ర పరీక్షలు చేశారు.